## క్లుప్తంగా

### నేడు కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**మన్సూరాబాద్:** కొన్ని రోజులుగా మన్సూరాబాద్ భవానీనగర్ కాలనీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని గురువారం నుంచి సహారాస్టేట్స్ కాలనీలోని లలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ రవి కుమార్ తెలిపారు. సమీప కాలనీల ప్రజలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కంటి పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు. నేటి నుంచి మార్చి 1 వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు. సెలవు రోజుల్లో సిబ్బంది అందుబాటులో ఉండరని చెప్పారు.

### కూరగాయల ధరలు

**వనస్థలిపురం:** సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో).. టమోటా 21, వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 35, కాకర 32, బీర 45, క్యాబేజీ 8, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 15, దొండ 23–35, చిక్కుడు 40, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19, దోస 23, సొర 13, పొట్ల 18, ఉల్లి 16, చామగడ్డ 60. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

### 18న కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వనస్థలిపురం:** మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18న వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకవార రుద్రాభిషేకాలు, రాత్రి 10.17 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 12.06 గంటలకు లింగోద్భవ కాల సమయంలో రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు.

### అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇవ్వండి


మహిపాల్‌రెడ్డి

**మలక్‌పేట:** జనసంఘ్ కాలం నుంచి దశాబ్దాల పాటు పార్టీ కోసం పని చేసిన తనకు మలక్‌పేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని, లేదంటే తన సోదరుడు తిరుమల్‌రెడ్డి పేరు పరిశీలించాలని బీజేపీ సీనియర్ నేత సామ మహిపాల్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. బుధవారం గడ్డిఅన్నారం నివాసంలో ఆయన మాట్లాడుతూ.. 1972 నుంచి జనసంఘ్‌లో, 1982లో జనతా పార్టీ, అనంతరం బీజేపీ కోసం పని చేస్తున్నానన్నారు. కశ్మీర్ ఏక్తా యాత్రలో పాల్గొనడంతో పాటు, పార్టీ కోసం జైలు జీవితం సైతం గడిపానని చెప్పారు. పోటీకి అవకాశం ఇస్తే ప్రజల్లో ఉన్న ఆదరణతో గెలుపు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**నాగోలు:** అదానీ అక్రమాలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎల్‌బీనగర్‌లో పార్టీ జాతీయ 19వ మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాములుయాదవ్ మాట్లాడుతూ.. ఆర్థిక నేరగాళ్లకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ అదానీ అక్రమాలపై బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే అదానిని అరెస్టు చేయాలన్నారు.

### సివిల్ సప్లయ్ విజిలెన్స్ మెంబర్‌గా సురేష్‌కుమార్


నియామకపత్రం అందుకుంటున్న సురేష్‌కుమార్

**మలక్‌పేట:** సివిల్ సప్లయ్ విజిలెన్స్ మెంబర్‌గా మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారానికి చెందిన చిత్రం సురేష్ కుమార్‌ నియమితులయ్యారు. అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి ఇఫ్రాన్ అహ్మద్ ఖాన్ చేతుల మీదుగా నియామకపత్రం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తన పేరును సిఫార్సు చేసిన ఎస్సీడీడీ యాదయ్య, సూపరింటెండెంట్ శంకరయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అవకతవకలు లేకుండా చూస్తానన్నారు.

### వృద్ధుడి అదృశ్యం

**హస్తినాపురం:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దగొల్ల ముట్టుగొండ(72) కొంతకాలంగా మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నాడు. అతడు ఈ నెల 12న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# రూ.18 కోట్లతో బస్ టెర్మినల్


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్‌బీనగర్:** ఎల్‌బీనగర్ పరిధిలోని ఆటోనగర్‌లో త్వరలోనే రూ.18 కోట్ల నిధులతో 24 బస్‌బేలతో కూడిన అత్యాధునిక హంగులతో ఏసీ శాటిలైట్ బస్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అరణ్యభవన్‌లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్యప్రాణి మండలి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్ టెర్మినల్ ఏర్పాటు చేసేందుకు వన్యప్రాణి మండలి సభ్యులు ఆమోదం తెలపడంతో పాటు వనస్థలికి చెందిన 1,354 హెక్టార్ల భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితమే బస్ టెర్మినల్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో ఆలస్యమైందన్నారు. ఆటోనగర్‌లో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే దృఢ సంకల్పంతోనే పలుమార్లు అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఏసీ శాటిలైట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆటోనగర్‌లోని ప్రస్తుత బస్‌స్టాప్‌లను క్రీడా మైదానానికి తరలించి ఒకే సమయంలో 100 బస్‌లు ఆగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. 490 కిలో వాట్ల సోలార్ విద్యుత్ ఏర్పాటుతో ఏసీ, నాన్ ఏసీ సౌకర్యంతో ప్రయాణికులకు నిరీక్షణ గదులు, నీటి శుద్ధి కేంద్రం, విశాలమైన పార్కింగ్ సదుపాయం, ఫుడ్ కోర్టులు వంటి అత్యాధునిక సౌకర్యాలతో బస్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆర్కేపురంలో ‘హాత్ సే హాత్ జోడో’ యాత్ర


యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**దిల్‌సుఖ్‌నగర్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని రామకృష్ణాపురం డివిజన్‌లో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. అల్కాపురి కాలనీ చౌరస్తాలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం యాత్ర ప్రారంభించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై పోరాడతాం



**మన్సూరాబాద్:** జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను జీహెచ్‌ఎంసీ సమావేశాల్లో ప్రస్తావిస్తూ అధికార బీఆర్‌ఎస్ పార్టీపై పోరాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంతోషిమాత ఆలయంలో మహారుద్రయాగం


కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న ఆలయ పూజారి

**హస్తినాపురం:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్‌కాలనీలో ఉన్న సంతోషిమాత దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మహారుద్రయాగం నిర్వహిస్తున్నారు. మొదటి రోజు బుధవారం స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ దంపతులు హాజరై పూజలు చేశారు. ధర్మ రక్షణ కోసం జరుగుతున్న మహారుద్రయాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియామకం



**మలక్‌పేట:** బీజేపీ విప్‌గా మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ బుధవారం నియామక జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె తన నివాసంలో మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. పలువురు నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళలపై హింసను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

**నాగోలు:** బీజేపీ అధికారంలో వచ్చాక దేశంలో మహిళలపై హింస పెరుగుతోందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్.జ్యోతి అన్నారు. మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ బుధవారం సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోతి మాట్లాడుతూ.. మహిళలు ఐక్యంగా ఉంటూ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలపై హింసను అరికట్టడానికి ఎన్ని చట్టాలు వచ్చినా కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం కఠినమైన శిక్షలు అమలు చేయకుండా హింసను అరికట్టడం సాధ్యం కాదని ఆమె అన్నారు. కార్యక్రమంలో కమల, ఎల్లమ్మ, వరలక్ష్మి మంజుల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్టెమ్ ల్యాబ్ ఏర్పాటు

**మలక్‌పేట:** అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ఇన్నోవేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. స్టూడెంట్స్ కార్నర్‌లో విద్యార్థులు ఏరోడైనమిక్స్, డ్రోన్, శాటిలైట్, రాకెట్ టక్నాలజీతో పాటు ఎలక్ట్రానిక్స్‌లో శిక్షణ పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఫౌండేషన్ సీఈవో, బోర్డు సభ్యులు, కంట్రీ డైరెక్టర్‌తో సహా 25 మంది సభ్యులు మెషిన్ ట్రిప్–2023లో భాగంగా బుధవారం మలక్‌పేట పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్కింగ్ మోడల్స్, బ్రెడ్ బోర్డ్‌లను ఉపయోగించి రూపొందించిన నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మండల ఉప విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

**చాదర్‌ఘాట్:** ప్రజా సమస్యలు పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ స్వార్థపూరిత రాజకీయాతో ప్రజలు అధోగతి పాలవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, రవీందర్, రాంకోటేశ్వరరావు, రాజేష్‌గుప్తా, ప్రసాద్ పాల్గొన్నారు.

**పాతబస్తీని అభివృద్ధి చేస్తాం..**

**సైదాబాద్:** ఎన్నికలు ఎప్పుడొచ్చినా పాతబస్తీలో మజ్లిస్, బీఆర్‌ఎస్ పార్టీల ఆగడాలను అడ్డుకొని బీజేపీ గెలుపు కోసం కృషి చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్‌లో ప్రజా గోస–బీజేపీ భరోసా పేరిట నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. పాతబస్తీని అభివృద్ధి చేయడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో యాకుత్‌పురా నియోజకవర్గంలో ప్రజలు బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబుయాదవ్, శరత్‌చంద్రగౌడ్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కబ్జాలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

**చాదర్‌ఘాట్:** మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలోని ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఉద్యమాలు చేస్తారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అందె రాంబాబు హెచ్చరించారు. బుధవారం ఆయన మలక్‌పేటలోని దివ్యాంగుల భవనంలో మాట్లాడుతూ.. కొంతమంది వ్యక్తులు సహకార సంస్థ స్థలం ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించారని, ఎవరు అడ్డుపడినా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ స్థలం విషయమై నగరంలోని దివ్యాంగులు ఎప్పుడు పిలుపునిచ్చినా పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యాలయ స్థలం ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కార్పొరేషన్ అధికారులు చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ స్థలాన్ని పరిశీలించారు.

## అప్పు పేరుతో మోసం చేస్తున్న గ్యాంగ్ అరెస్ట్

**నాగోలు:** అప్పు ఇస్తామంటూ మోసం చేసేందుకు యత్నించిన 9 మందిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.కోటి 23 లక్షల 45 వేల 5 వందలు స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉండే నీలేష్ కృష్ణారావ్(38) ప్రైవేట్ ఉద్యోగి. పూణెలో ఉంటూ రియల్ ఎస్టేట్, వెహికిల్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న అతడి స్నేహితులు వైభవ్, ఉత్తంచందర్ అప్పు కోసం కృష్ణారావ్‌ను సంప్రదించారు. మన్సూరాబాద్ ఎరుకుల నాంచారమ్మనగర్‌కు చెందిన కొందరు రుణాలు ఇస్తుంటారని తెలుసుకున్న కృష్ణారావ్ మెదక్‌కు చెందిన కండెల శ్రీనివాస్(30) అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. సాయిసప్తగిరి కాలనీలో ఉండే శంకరమ్మ(45) ఇంట్లో డబ్బులు ఉన్నాయని చెప్పి శ్రీనివాస్ వారిని తీసుకెళ్లాడు. అక్కడ పెద్ద మొత్తంలో ఉన్న రూ.500 నోట్ల కట్టలను చూపించాడు. అయితే ఆ నోట్ల కట్టల మధ్య ధర్మాకోల్ ఉన్నట్లు వారు గుర్తించారు. అనుమానం వచ్చిన కృష్ణారావు ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం రాత్రి శంకరమ్మ ఇంటికి చేరుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. కండెల శ్రీనివాస్, శంకరమ్మ, శ్రీనివాస్ సోదరుడు కండెల రమేష్, మన్సూరాబాద్‌కు చెందిన రవికుమార్, సుంకమ్మ, కొంపల్లికి చెందిన నాగయ్య, మెదక్‌కు చెందిన రాములు, సౌత్ ఎండ్ పార్క్‌కు చెందిన దర్గప్ప, నిజామాబాద్‌కు చెందిన బోజన్న కలిసి నిజమైన డబ్బుతో పాటు నకిలీ నోట్లను సైతం చూపించి రుణం అవసరం ఉన్న వారికి అధిక వడ్డీకి ఇస్తుంటారని పోలీసులు తెలిపారు.

## గోడ నిర్మిస్తుండగా కిందపడి తాపీమేస్త్రి మృతి

**నాగోలు:** గోడ నిర్మిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మేస్త్రి మృతిచెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని ప్రకాశం జిల్లా ఉప్పుపాడుకు చెందిన రాకేష్(25) అతడి భార్య కీర్తి, ఇద్దరు కుమారులతో కలిసి హయత్‌నగర్ సీఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్నాడు. వృత్తి రీత్యా మేస్త్రి పని చేస్తుంటాడు. మన్సూరాబాద్, సాయినగర్ కాలనీలోని ఓ భవనంలో మొదటి అంతస్తులో గోడ కడుతుండగా కాలు జారి కింద పడిపోయాడు. కిందపడే సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడంతో పాటు కింద పడిన సమయంలో తలకు బలమైన గాయాలయ్యాయి. హాస్పిటల్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భార్య కీర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## మెరుగైన సదుపాయాల కల్పనకు నిరంతర కృషి


ఎమ్మెల్యే బలాలకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

**మలక్‌పేట:** ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల బుధవారం వెస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కలుషిత తాగునీరు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్, స్ట్రీట్ లైట్లు, పార్కులు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాలనీ పార్కులో సోమవారం అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరిత అజిత్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ధనుంజయ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఎంవీ మధుకర్, ప్రధాన కార్యదర్శి మురహరి, కోశాధికారి శ్రీనివాస్ ప్రసాద్, మజ్లిస్ నాయకులు కసుకల రవీందర్‌రెడ్డి, షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## చండీ యాగం ఏర్పాట్ల పరిశీలన


చండీ యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**ఎల్‌బీనగర్:** చండీ మహాయాగానికి హాజరయ్యే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బీఎన్ రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నిర్వాహకులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ సెక్టార్–03లో మెల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న మాన్యు రుద్ర సహిత నవ చండీయాగం ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా కాలనీలో చండీ యాగం నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం ఆయన కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పర్యటించారు. వీధి దీపాలు, పారిశుధ్యం సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రవీణ్, హరినాథ్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

**చంపాపేట:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట గాంధీ విగ్రహం చౌరస్తాలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనం గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ పార్టీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్‌తో కలిసి కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల ఎజెండాతో సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలోని ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం, నిరుద్యోగ భృతి, దళిత ముఖ్యమంత్రి వంటి అనేక హామీలను విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో అడ్వకేట్ కరుణసాగర్, పార్టీ నాయకులు శైలజ, యోగిరాజ్, శ్రీనివాస్, సందీప్, అంజి, సద్ది సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, వీరారెడ్డి, అవినాష్‌రెడ్డి, రాజేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి


సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

**హయత్‌నగర్:** వచ్చే సాధారణ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని, బీఆర్‌ఎస్ నిరంకుశ పాలన గురించి ప్రజలకు వివరించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నివాసంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను బీజేపీకి అనుకూలంగా మార్చుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, నాయకులు బండారి భాస్కర్, పారంద మహేష్, యాదగిరిగౌడ్, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

**చైతన్యపురి:** ప్రియురాలు మోసం చేయడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన వల్లపురెడ్డి శివారెడ్డి(25) చైతన్యపురిలో ఐస్‌క్రీం పార్లర్ నిర్వహిస్తున్నాడు. ఏడేళ్ల నుంచి ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి ఆమె శివారెడ్డితో సరిగ్గా మాట్లాడడం లేదు. దీంతో మనస్థాపం చెందిన అతడు మంగళవారం రాత్రి తను నిర్వహించే షాపులోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె లేని జీవితం నాకొద్దు, సర్వస్వం మనసిచ్చిన ఆమెకే ఖర్చు చేశాను, వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటానంటుంది, అందుకే చనిపోతున్నా అంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. శివారెడ్డి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### తల్లి ప్రేమ దూరమైందని..

కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన సంజయ్‌కుమార్ మోరే కుటుంబంతో కలిసి కొత్తపేట ఎస్‌బీహెచ్ కాలనీలో ఉంటున్నాడు. అతడితో భార్య కొన్ని రోజుల క్రితం గొడవ పడి కర్ణాటక వెళ్లింది. అప్పటి నుంచి సంజయ్‌కుమార్ కుమారుడు నరేష్ మోరే(24), కూతురు రిషిత మోరేతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 11న తల్లికి నచ్చజెప్పి తీసుకొచ్చేందుకు ముగ్గురు కలిసి సొంతూరు వెళ్లారు. అయితే ఆమె రానని చెప్పడంతో తిరిగి వచ్చారు. తల్లి ప్రేమ దూరమైందని కొన్ని రోజులుగా నరేష్ మనస్థాపంతో ఉన్నాడు. మంగళవారం రాత్రి సోదరి రిషితకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో తండ్రికి సమాచారం ఇచ్చింది. అతడు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎంఆర్‌ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

# సంత్ సేవాలాల్‌కు ఘన నివాళి


సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

**మన్సూరాబాద్:** సంత్ సేవాలాల్ 284వ జయంతి వేడుకలను ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బుధవారం ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తేజావత్ రాందాస్‌నాయక్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ నాగమల్లు హాజరై సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రమావత్ రవినాయక్, రాములునాయక్, లింగం తదితరులు పాల్గొన్నారు.

**వీవీనగర్ బస్టాప్‌లో..**

**చైతన్యపురి:** గడ్డి అన్నారం డివిజన్ భారతీయ జనతా గిరిజన మోర్చా ఆధ్వర్యంలో వీవీనగర్ బస్టాప్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధీరజ్‌రెడ్డి, చిలుకూరు రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆనంద్, లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి, జయప్రకాష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపేట డివిజన్‌లో..**

**నాగోలు:** గిరిజన, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ శివగంగా కాలనీలో బంజారా నాయకుడు మోతీలాల్ రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు


నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్